సాక్షి ఆదిలాబాద్

బుధవారం । 20 । డిసెంబర్ । 2023



'మహాలక్ష్మి' రద్దు చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన మహాలక్ష్మి పథకాన్ని వెంటనే రద్దు చేయాలని ఆటో యూనియన్ ఆధ్వర్యంలో జిల్లాలో పలుచోట్ల ఆందోళన చేపట్టారు. 9లో▸

ఐదెకరాలకే రైతుబంధు వర్తింపజేయాలి

ఆదిలాబాద్‌రూరల్: రైతుబంధు పథకాన్ని ఐదెకరాల్లోపు ఉన్న రైతులకే వర్తింపజేయాలని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం వేలాది ఎకరాలు ఉన్న వారికి సైతం రైతుబంధు ఇచ్చి ప్రజాధనాన్ని వృథా చేసిందని ఆరోపించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
24.0/10.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. ఉదయం, సాయంత్రం చలి ప్రభావం కనిపించనుంది.

న్యూస్‌రీల్

కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు పదోన్నతి



రాహుల్‌రాజ్, కలెక్టర్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు పదోన్నతి లభించింది. 20 15 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఈయనకు జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్ స్కేల్‌తో కూడిన పదోన్నతి కల్పిస్తూ జిల్లా కలెక్టర్‌గానే పోస్టింగ్‌ను ప్రభుత్వం కొనసాగించింది. పదోన్నతి ఉత్తర్వులు 01.01.2024 నుంచి అమల్లోకి రానున్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే

ఆదిలాబాద్: జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డిని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేగా విజయం సాధించిన అనంతరం ఎస్పీని తొలిసారిగా కలిసిన ఆయన ఎన్నికల నిర్వహణ శాంతియుతంగా నిర్వహించడంపై పోలీస్ యంత్రాంగానికి ధన్యవాదాలు తెలిపారు. ఎస్పీని శాలువాతో సన్మానించారు. అలాగే ఎమ్మెల్యేను ఎస్పీ పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

పల్లె ప్రగతి పనులు పకడ్బందీగా చేపట్టాలి



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

జైనథ్: గ్రామాల్లో పల్లె ప్రగతి పనులు పకడ్బందీగా నిర్వహచాలని అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. మండలంలోని భోరజ్, మాండగాడ గ్రామాల్లో మంగళవారం ఆమె పర్యటించారు. జీపీఎస్‌ల రెగ్యులరైజేషన్ కోసం అవసరమైన రికార్డులు పరిశీలించారు. అలాగే సెగ్రిగేషన్ షెడ్లు, శ్మశానవాటిక, పల్లె ప్రకృతి వనాల నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మండలంలో 21మంది జీపీఎస్‌లు ఇప్పటికే రెగ్యులరైజ్ అయినట్లు తెలిపారు. ఇంకా నలుగురు మిగిలిపోయారని, వారి పని తీరు నివేదికను కలెక్టర్‌కు పంపనున్నట్లు పేర్కొన్నారు. ఆమె వెంట ఎంపీవో వెంకట్‌రాజు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

బేలలో చలి @ 9.4°c



బేలలో చలిమంట కాగుతున్న జనం

బేల: మండలకేంద్రంతో పాటు చప్రాల, జూనోని, తదితర గ్రామాల్లో మంగళవారం చలి తీవ్రత పెరిగింది. జిల్లాలోనే అత్యల్పంగా బేలలో 9.4డిగ్రీల సెల్సియస్ నమోదైంది. శీతల గాలులతో జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల చలిమంటలు కాగుతూ కనిపించారు.

'కడెం'ను సందర్శించిన స్కాడా బృందం



గేట్ల వద్ద పనులను పరిశీలిస్తున్న స్కాడా అధికారులు

కడెం: కడెం ప్రాజెక్టును స్కాడా(సూపర్‌వైజరీ కంట్రోల్ అండ్ డేటా ఆక్విషన్)ఎక్స్‌పర్ట్ రాకేశ్ బట్‌తో కలిసి బృందం మంగళవారం సందర్శించింది. గతేడాది ప్రారంభించిన స్కాడా సిస్టం పనులను పరిశీలించారు. అనంతరం ప్రాజెక్ట్ పాత జనరేటర్ రూంలో ఏర్పాటు చేసిన స్కాడా సిస్టం పనితీరును తనిఖీ చేశారు. ప్రాజెక్ట్‌పై స్కాడా పనులు 80 శాతం పూర్తయ్యాయని, గేట్ల మరమ్మతులు పూర్తయ్యాక స్కాడా సిస్టం ప్రారంభిస్తామని ఏఈ ఏఆర్‌ఎస్.శర్మ పేర్కొన్నారు. బృందం వెంట డీఈఈ మాధవి, ఏఈఈ రమాదేవి, ప్రాజెక్టు డీఈ భోజదాసు, ఏఈఈ రవికుమార్ ఉన్నారు.

ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో మంగళవారం బారులు తీరిన పత్తి వాహనాలు



నిలువు దోపిడీ..



ఇక్కడ కనబడుతున్న రెండు రశీదులు పత్తి తూకం కాంటాకు సంబంధించినవి . పైది ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో తీసింది, కిందిది ప్రైవేటు వేబ్రిడ్జిపై తీసినది. ఈ రెండూ ఆదిలాబాద్ రూరల్ మండలం చాందా గ్రామానికి చెందిన ఆరె నవీన్‌కుమార్‌కు చెందిన ట్రాక్టర్‌లో తీసుకువచ్చిన పత్తి నిల్వలకు సంబంధించినవే. యార్డులోని 8వ నంబర్ కాంటాపై తూకం చేయించగా ట్రాక్టర్, అందులోని పత్తి బరువు కలుపుకుని 73 క్వింటాళ్ల 05 కిలోలు వచ్చింది. అదే వాహనాన్ని అందులోని పత్తితో కలుపుకుని యార్డుకు సమీపంలోనే ఉన్న ప్రైవేటు వేబ్రిడ్జిపై తూకం చేయించగా 73 క్వింటాళ్ల 45 కిలోలు వచ్చింది. యార్డులో 40 కిలోల తేడాతో రైతు నష్టపోయే పరిస్థితి.

- పత్తి కొను'గోలుమాల్'!
- ఏఎంసీ యార్డు తూకం కాంటాలో తేడా
- 25 నుంచి 60 కిలోల వరకు తక్కువగా..
- సీసీఐకి విక్రయించేందుకు వచ్చిన వారికి టోకరా
- ఆదిలాబాద్‌లో దూది రైతుల ఆందోళన



యార్డులోని 8వ నంబర్ కాంటా వద్ద తూకంలో తేడాను రశీదులతో సహా చూపిస్తున్న రైతులు

సాక్షి,ఆదిలాబాద్: పత్తి రైతు నిలువు దోపిడీకి గురవుతున్నాడు. ఏటా పంట సాగుకు పెట్టుబడి పెరుగుతుండగా.. వచ్చిన అరకొర దిగుబడిని అమ్ముకునేందుకూ తిప్పలు తప్పట్లేదు. ఆరుగాలం కష్టపడినా గిట్టుబాటు ధర అందని పరిస్థితి. తాజాగా సీసీఐ టోకరాతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం పత్తిని విక్రయించేందుకు వచ్చిన రైతులు 8వ నంబర్ తూకం కాంటాపై బరువు తక్కువగా వస్తుందని ఆందోళన చేపట్టారు. పలువురు రైతులు ఈ తూకానికి సంబంధించి ప్రైవేట్‌లో తాము తీయించిన రశీదులో ఉన్న బరువుకు ఇక్కడ తీసిన రశీదులోని బరువు తక్కువగా వచ్చిన తేడాలను చూపిస్తూ అధికారులను నిలదీశారు.

సీసీఐకి విక్రయించేందుకు వచ్చి..

జిల్లాలో ఈ సీజన్‌లో పత్తి కొనుగోళ్లు మొదలైన తర్వాత వారం రోజులుగా మార్కెట్‌కు పత్తిని విక్రయించేందుకు రైతులు పెద్ద ఎత్తున వస్తున్నారు. మద్దతు ధర రూ.7,020ని మించి వస్తుందని ఆశపడ్డ కర్షకులకు మార్కెట్‌లో పెరిగే పరిస్థితులు కనిపించట్లేదు. దీంతో నిల్వ ఉంచిన పత్తిని విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు. ప్రైవేటులో తేమ పేరిట వ్యాపారులు ధర తగ్గిస్తుండటంతో సీసీఐకి అమ్మి మద్దతు ధర తీసుకెళ్దామని ఆశిస్తున్నారు. అయితే కాంటా రూపంలో రైతులను ఇటు సీసీఐ, అటు మార్కెటింగ్ అధికారులు నిలువు దోపిడీకి గురి చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సీసీఐకి పత్తిని విక్రయించేందుకు వచ్చిన రైతులు మొదట మార్కెట్ యార్డులో వాహనంతో కలిపి అందులో ఉన్న పత్తి బరువు తూకం చేస్తారు. ఆతర్వాత ఆ రశీదు తీసుకుని సీసీఐ కొనుగోలు చేసే జిన్నింగ్‌కు వెళ్లి పత్తిని వాహనంతో సహా అక్కడ మరోసారి తూకం చేస్తారు. ఇలా రెండు సార్లు తూకం చేసిన తర్వాత పత్తి బరువుకు తగ్గట్లుగా రైతుకు ధర ఇస్తారు. అయితే మార్కెట్ యార్డులో పత్తి తూకం చేసినప్పుడు 25 కిలోల నుంచి 60 కిలోల వరకు కొంత మందికి క్వింటాలుపైన తేడా వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సీసీఐ కొనుగోలు చేసే జిన్నింగ్‌లలోనూ కాంటాలపై తక్కువ బరువు చూపిస్తుందని పలువురు రైతులు ఆరోపిస్తూ మంగళవారం ఆందోళన చేపట్టారు. మార్కెటింగ్, యార్డు అధికారులను నిలదీశారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు యార్డులో ఇది కొనసాగింది. అధికారులు దీన్ని సరి చేసి రైతులందరికీ న్యాయం చేస్తామని చెప్పారు. ఇదిలా ఉంటే 8వ నంబర్ కాంటాపై మంగళవారం 113 వాహనాలు తూకం చేశారు. అందులో పలువురు రైతులు బరువు తేడాకు సంబంధించి గొడవ చేయడంతో ఆ వాహనాలను మరో కాంటాపై తూకం చేశారు. రాత్రి వరకు ఈ తతంగం కొనసాగింది.

టెక్నికల్ ప్రాబ్లమ్‌తోనే..



యార్డులోని 8వ నంబర్ కాంటాపై టెక్నికల్ ప్రాబ్లమ్ కారణంగా బరువు తక్కువగా రావడం జరిగింది. మంగళవారం మధ్యాహ్నం నుంచి ఇలాంటి పరిస్థితి ఎదురైంది. ఇన్ని రోజుల పాటు ఎలాంటి సమస్య ఉత్పన్నం కాలేదు. రైతులను నష్ట పోకుండా చర్యలు తీసుకున్నాం. – మధుకర్, ఆదిలాబాద్ మార్కెట్ యార్డు కార్యదర్శి

యార్డు, జిన్నింగ్‌లోనూ తేడా..



నేను 31 క్వింటాళ్ల పత్తిని సీసీఐకి అమ్మేందుకు మంగళవారం ఆదిలాబాద్ మార్కెట్‌కు ట్రాక్టర్‌లో తీసుకువచ్చాను. యార్డులో 25 కిలోల తక్కువ తూకం చూపించగా, అదే పత్తిని సీసీఐ కొనుగోలు చేస్తున్న జిన్నింగ్‌లో తూకం చేయించగా 35 నుంచి 40 కిలోల వరకు తక్కువగా వచ్చింది. ఇటు మార్కెట్ అధికారులు, అటు సీసీఐ అధికారులు కలిసి రైతులను నిలువు దోపిడీకి గురి చేస్తున్నారు. – లచ్చిరెడ్డి, రైతు, పెండల్‌వాడ, జైనథ్ మండలం

లెక్క తేల్చారు..!

- జిల్లాలో స్థానిక సంస్థలకు రూ.703.99 కోట్లు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా నిధులు
- పదేళ్ల ఆదాయ, వ్యయాలపై ప్రభుత్వానికి అధికారుల నివేదిక



జిల్లా పరిషత్ కార్యాలయం

స్థానిక సంస్థలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించిన నిధులు (రూ.కోట్లలో)

	కేంద్ర నిధులు	రాష్ట్ర నిధులు
జిల్లా పరిషత్‌కు	57.77	11.79
మండల పరిషత్‌లకు	39.64	80.61
గ్రామ పంచాయతీలకు	219.99	294.18



కైలాస్‌నగర్: స్థానిక సంస్థల పదేళ్ల ఆదాయ వ్యయ, వివరాలు సమర్పించాలని ప్రభుత్వం ఆయా శాఖలను ఆదేశించింది. ఈ మేరకు రంగంలోకి దిగిన యంత్రాంగం గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్ లెక్కలు తేల్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వివిధ పథకాల కింద అందిన నిధులు, ఇప్పటి వరకు చేసిన వ్యయం, మిగులు వివరాలను యుద్ధ ప్రతిపాదికన సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో జిల్లాలోని స్థానిక సంస్థలకు రూ.703కోట్ల 99లక్షల 89వేల 506 నిధులు అందినట్లుగా లెక్క తేల్చారు.

ఇందులో జెడ్పీ, ఎంపీపీలు

రూ.186కోట్ల 04లక్షల17వేల 309 నిధులను ఖర్చు చేశారు. కొంతమేర బ్యాలెన్స్ నిధులు ఉన్నట్లుగా చూపించారు. అయితే ఆ నిధులకు సంబంధించి పనులకు అనుమతులు ఇచ్చినందున వాటిని కూడా ఖర్చు చేసినట్లుగానే భావిస్తున్నారు. ప్రభుత్వం నిధుల లెక్కలు అడుగుతుండటంతో గతేడాది కాలంగా నిలిచిపోయిన ఎస్‌ఎఫ్‌సీ నిధుల విడుదలపై సర్పంచ్‌లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జెడ్పీ, ఎంపీపీల్లో ఆదాయ, వ్యయాల వివరాలిలా..

బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ఆదిలాబాద్ జిల్లా పరిషత్, 17 మండల పరిషత్‌లు, 468 గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ స్కీంల కింద జిల్లాకు రూ.703.99 కోట్ల నిధులు కేటాయించారు. ఇందులో జిల్లా పరిషత్‌కు రూ.69కోట్ల 56లక్షల 91వేల 327 కేటాయించగా రూ.71,14,39,156 ఖర్చు చేశారు. అయితే వచ్చిన నిధుల కంటే రూ.1కోటి 57లక్షల 47వేల 829 అధికంగా ఖర్చు చేసినట్లు చూపడం గమనార్హం. మిగులు నిధులతో ఆదాయం కంటే వ్యయం ఎక్కువగా జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. అలాగే మండల పరిషత్‌లకు రూ.120కోట్ల 25లక్షల 59వేల 263 కేటాయించగా ఇందులో రూ.114కోట్ల 89లక్షల 78వేల 153 ఖర్చు చేసినట్లుగా ప్రభుత్వానికి నివేదించారు. ఇంకా రూ.5కోట్ల 35లక్షల 81వేల110 బ్యాలెన్స్ ఉన్నట్లుగా నివేదికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి వివరాలు సమర్పించారు.

పంచాయతీలకు రూ.514కోట్లు

జిల్లాలోని 468 గ్రామ పంచాయతీలకు గాను పదేళ్లలో రూ.514కోట్ల 17లక్షల 38వేల 916 కేటాయించారు. ఇందులో 13వఆర్థిక సంఘం కింద రూ.17కోట్ల 58లక్షల 71వేల 603, 14వ ఆర్థిక సంఘం కింద రూ.276కోట్ల 59లక్షల 41వేల 032 విడుదల చేశారు. ఎస్‌ఎఫ్‌సీ కింద రూ.219కోట్ల 99లక్షల 26వేల 281లు మంజూరు చేశారు. ఇందులో ఖర్చు చేసిన నిధుల వివరాలను పంచాయతీల వారీగా ఈ పంచాయతీ వెబ్‌సైట్‌లో కార్యదర్శులు నమోదు చేశారు. అయితే పంచాయతీలకు కొన్ని నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన ఎస్‌ఎఫ్‌సీ నిధులు సకాలంలో అందడంలేదు. దీంతో చిన్న జీపీల సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతున్నారు. కాగా ఆదాయం కలిగిన మేజర్ గ్రామ పంచాయతీల్లో బ్యాలెన్స్ నిధులు ఉన్నట్లుగా అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. జిల్లాలో బోథ్, ఉట్నూర్, ఇంద్రవెల్లి, ఇచ్చోడ వంటి మేజర్ గ్రామ పంచాయతీల్లో నిధులు మిగిలే అవకాశముంది. అలాంటి పంచాయతీలు మిగులు నిధులను ఇష్టారాజ్యంగా కేటాయించకుండా నిబంధనల మేరకు ఖర్చు చేయాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించినట్లుగా జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధుల వివరాలను కోరినందున పంచాయతీలకు కొద్ది నెలలుగా పెండింగ్‌లో ఉన్న నిధులు విడుదల చేసే అవకాశముందని సర్పంచ్‌లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి

- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఆదిలాబాద్: పోలీసులు క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్‌క్వార్టర్స్ మైదానంలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి పోలీసు వార్షిక క్రీడల ముగింపు కార్యాక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. పోలీసు సిబ్బంది విధులతో పాటు ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలన్నారు.కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ శ్రీనివాస్, రిజర్వ్ సీఐలు మురళి నవీన్‌కుమార్, స్వామి, రిజర్వ్ సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలు వీరే..

100 మీటర్ల పరుగు : డి.గజానంద్ (స్వర్ణ), అక్షయ్ (రజత), ఇంజమామ్‌ముల్ (కాంస్య)

400 మీటర్ల పరుగు : పి.దేవన్న (స్వర్ణ), ఇంజమాముల్ (రజత), కె.మహేందర్ (కాంస్య)



విజేత జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

క్రికెట్..: ఆదిలాబాద్ స్పెషల్ పార్టీ బృందం (విన్నర్), ఆదిలాబాద్ సబ్ డివిజన్ పోలీసు (రన్నర్).

వాలీబాల్..: ఏఆర్ హెడ్ క్వార్టర్స్ జట్టు(విన్నర్), ఆదిలాబాద్ స్పెషల్ పార్టీ బృందం(రన్నర్)

కబడ్డీ: ఏఆర్ హెడ్ క్వార్టర్స్ జట్టు(విన్నర్), స్పెషల్ పార్టీ ఆదిలాబాద్ జట్టు (రన్నర్).

గోమాతను రక్షించే చర్యలు చేపట్టాలి

కైలాస్‌నగర్: పట్టణంలో గోమాతను రక్షించేలా మున్సిపల్ యంత్రాంగం తగు చర్యలు తీసుకోవాలని గోమాత సేవ ఫౌండేషన్ అధ్యక్షుడు సురేశ్ అన్నారు. ఈమేరకు మున్సిపల్ కార్యాలయం ఎదుట ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో సంచరిస్తున్న గోవులను గోశాలకు తరలించి వాటి సంరక్షణ బాధ్యతలు మున్సిపల్ ద్వారా చేపట్టాలన్నారు. గోమాత చనిపోతే అంత్యక్రియల నిర్వహణ కోసం ప్రత్యేక జేసీబీని అందుబాటులో ఉంచాలని కోరారు. అనంతరం గోవుల సంరక్షణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరుతూ మున్సిపల్ మేనేజర్ దివాకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు సంతోష్, రాజేశ్, సాయి, పృథ్వీ, అజయ్, సంతోష్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

'సంక్షేమ' నివేదికలు సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

- కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నివేదికలను సిద్ధం చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 21న హైదరాబాద్‌లో జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, తహసీల్దార్లతో మంగళవారం సాయంత్రం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ పథకాలపై నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. రైతుబంధు, కౌలురైతుల గుర్తింపు ప్రక్రియ, కొత్త రేషన్ కార్డులకు అర్హుల అంచనాలు, పింఛన్లు, మహాలక్ష్మి, గృహలక్ష్మి వివరాలతో కూడిన నివేదికలు సిద్ధం చేయాలన్నారు. గ్రామాల వారీగా ధరణి, భూ సమస్యలు, ప్రభుత్వ, ప్రైవేటు భూ సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై పూర్తి సమాచారం అందించాలన్నారు. ప్రజావాణిలో అందిన దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి వారం మండలాల వారీగా పెండింగ్ గ్రీవెన్స్‌ల సమీక్ష చేయాలన్నారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఖుష్బూ గుప్తా, శ్యామలాదేవి, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో, ఆర్డీవోలు స్రవంతి, జీవాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ మృతికి సంతాపం

అంతకు ముందు ఈ నెల 18న గుండెపోటుతో మృతి చెందిన భీంపూర్ తహసీల్దార్ జె.నారాయణ మృతికి సంతాపం తెలిపారు. నారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉద్యోగరీత్యా అధికారులు వివిధ ప్రాంతాల్లో పనిచేయడం జరుగుతుందని, ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు.

బల్దియా అభివృద్ధే లక్ష్యం

- రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గద్దు
- అక్రమాలను సహించేది లేదు..
- ఎమ్మెల్యే పాయల్ శంకర్
- మున్సిపల్ అధికారులతో సమీక్ష



మున్సిపల్ అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

కైలాస్‌నగర్: అధికారులు ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా బల్దియా అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయా విభాగాల మున్సిపల్ అధికారులు, ఉద్యోగులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. పలు అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. వినాయక్‌చౌక్‌లో వాహనదారులకు రోడ్డు కనిపించకుండా చేపట్టిన నిర్మాణాన్ని తక్షణమే కూల్చివేయాలని, అలాగే పట్టణంలో అక్రమ హోర్డింగ్‌లను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఖాళీగా ఉన్న ప్లాట్లకు ఇంటినంబర్లు కేటాయించాలన్నారు. మున్సిపల్ లీజు స్థలాలు, రెవెన్యూ అప్పగించిన స్థలాలు ఎట్టి పరిస్థితుల్లోనూ కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు. వార్డు నంబర్ 29లో రూ.10లక్షలతో నిర్మించిన ఓపెన్ జిమ్‌ను ఆరు నెలలు కూడా గడువక ముందే తొలగించి టింబర్ డిపో ఏర్పాటుకు బాధ్యులైన వారిపై తక్షణమే కేసు నమోదు చేయాలని ఆదేశించారు. హరితహారం కింద రూ.కోట్లు ఖర్చు చేసినా క్షేత్రస్థాయిలో మాత్రం మొక్కలు కనిపించడం లేదన్నారు. అన్నివార్డుల్లో ఒక రోజు ప్రత్యేక సర్వే చేయించి హరితహారం వివరాలు అందజేయాలన్నారు. ప్రధానచౌక్‌ల్లో పెద్ద డివైడర్లు నిర్మించడం ద్వారా రోడ్లు ఇరుకుగా మారి ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ శాఖలు సంయుక్తంగా ఒక రోజు పట్టణమంతా కాలినడకన తిరిగి పరిస్థితిని తెలుసుకుని ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుందామని చెప్పారు. మున్సిపల్ మడిగిల్లో అద్దె బకాయిల వసూలుపై దృష్టి సారించాలన్నారు. అలాగు పెండింగ్‌లో ఉన్న బడాబాబుల నుంచి ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్ట్ చేయాలన్నారు. పారిశుధ్య కార్మికులకు ప్రతినెల 2వ తేదీన వేతనాలు చెల్లించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విలీన గ్రామాల్లో పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయని, ఆయా చోట్ల మౌలిక సౌకర్యాలను కల్పించేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా బల్దియా అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలని, ఆదిశగా అధికారులు, ఉద్యోగులకు అన్ని విధాలా తాను అండగా ఉంటానని భరోసానిచ్చారు. అక్రమాలకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే మాత్రం సహించేదిలేదని హెచ్చరించారు. అంతకు ముందు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఏ.శైలజ, డీఈఈలు తిరుపతి, యూనిస్, ఏఈ అరుణ్ కుమార్, రెవెన్యూ అధికారి జాదవ్ కృష్ణ , మెప్మా డీపీఎం శ్రీనివాస్, టీఎంసీ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

తానూరు(ముధోల్): మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఉమ్రి(కే) గ్రామానికి చెందిన కదం బాలాజీ (47) ఎనిమిదేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం మద్యం మత్తులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య సవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

కోతి దేవుని జాతరకు సర్వంసిద్ధం



జాతరకు ముస్తాబైన ఆలయం

లక్ష్మణచాంద(నిర్మల్): మండలంలోని ధర్మారం గ్రామంలో బుధవారం జరిగే కోతి దేవుని జాతరకు సర్వం సిద్ధమైంది. దూర ప్రాంతాల భక్తులు మంగళవారం ఉదయం నుంచే కోతి దేవుని సన్నిధానం చేరుకున్నారు. రాత్రి 10 గంటలకు రథోత్సవంతో జాతర ప్రారంభానికి అంకురార్పణ జరుగుతుంది. ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

యువకుడిపై పోక్సో కేసు

గుడిహత్నూర్(బోథ్): మండలంలోని నేరడిగొండతాండకు చెందిన బాలిక(13)ను కిడ్నాప్ చేసిన నార్నూర్ మండలం ఉమ్రి గ్రామానికి చెందిన చౌహాన్ వినేష్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై సయ్యద్ ఇమ్రాన్ తెలిపారు. చౌహాన్ వినేష్ మండలంలోని నేరడిగొండతండాలో గల తన మిత్రుని వద్దకు అప్పుడప్పుడు వెళ్తుండేవాడు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన బాలికతో పరిచయం ఏర్పడింది. ఈ నెల 12న సదరు యువకుడు బాలికను కిడ్నాప్ చేసి తీసుకెళ్లాడని బాలిక తల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఈనెల 18న ఆచూకీ లభించడంతో ఇద్దరినీ తీసుకువచ్చి బాలికను వైద్యపరీక్షల నిమిత్తం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. కిడ్నాప్ చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం



ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఏఈ

సోన్: మండలంలోని 44వ జాతీయ రహదారి పక్కన, భారత్ పెట్రోలు పంపు ఎదుట పంటపొలాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అందులో ఉన్న కాపర్ వైర్‌ను చోరీ చేశారు. పరికరాలను పంట పొలాల్లో పడేసి వెళ్లారు. ఏఈ శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు.

షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం

ఆదిలాబాద్‌రూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు చెలరేగిన సామగ్రి దగ్ధమైన ఘటన మండలంలోని రామాయి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జట్టి కిషోర్ ఇంట్లో మంగళవారం షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకున్నాయి. గమనించిన స్థానికులు గంట పాటు శ్రమించి మంటలను ఆర్పేశారు. దీంతో గ్రామంలో పెద్ద ప్రమాదం తప్పడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఈ ప్రమాదంలో ఇంట్లోని ఫ్రిజ్, ఇతర సామగ్రి దగ్ధమయ్యాయి.

ఆ విషపు కర్మాగారం మాకొద్దు

- ఇథనాల్ పరిశ్రమపై కొనసాగుతున్న దిలావర్‌పూర్ వాసుల ఆందోళన
- పరిశ్రమ దుష్పరిణామాలు తెలుసుకునేందుకు నారాయణపేట జిల్లాలో పర్యటన
- కర్మాగారాన్ని తరలించే వరకు పోరాటం చేస్తామంటున్న రైతులు
- బుధవారం మండల బంద్‌కు పిలుపు



చిత్తనూరు బాధితులతో కలిసి నినాదాలు చేస్తున్న దిలావర్‌పూర్ గ్రామ పెద్దలు,యువకులు

దిలావర్‌పూర్(నిర్మల్): చుట్టూ పచ్చని పంటచేలు, పక్కనే గోదావరి నది, నిత్యం ఎలాంటి కాలుష్యం లేకుండా స్వేచ్ఛావాయువులు పీలుస్తున్న తమను స్వేచ్ఛగా బతుకనీయాలని, విషం చిమ్మే ఇథనాల్ కర్మాగారం మా పరిసరాల్లో వద్దంటూ దిలావర్‌పూర్‌తో పాటు మండలంలోని గుండంపల్లి, తదితర గ్రామాల ప్రజలు ముక్త కంఠంతో తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రమైన దిలావర్‌పూర్ గుండంపల్లి గ్రామాల నడుమ దాదాపుగా 40 ఎకరాల విస్తీర్ణంలో నిర్మితమవుతున్న ఇథనాల్ కర్మాగారాన్ని అడ్డుకునేందుకు కొన్ని రోజులుగా దిలావర్‌పూర్, గుండంపల్లి వాసులు ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. తీరా పనులు ఊపందుకోవడంతో ఆందోళన మరింత ఉధృతం చేశారు. ఈనేపథ్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మరికల్ మండలంలోని చిత్తనూరు ఇథనాల్ కర్మాగారాన్ని మంగళవారం ఉదయం ఇథనాల్ కర్మాగార వ్యతిరేక జేఏసీ సభ్యులు స్వచ్ఛందంగా అక్కడకు తరలివెళ్లారు. చిత్తనూరు గ్రామ ప్రజలను కలిసి కర్మాగారం తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. వారి పరిస్థితులు తెలుసుకున్న గ్రామస్తులు తీవ్ర భయకంపితులయ్యారు. కర్మాగారం నుండి వస్తున్న దుర్వాసన, కలుషిత నీరు, శబ్దాలు, ఇతర వ్యర్థాలు తమ జీవన మనుగడను దెబ్బతీస్తున్నాయన్నారు. దీంతో అక్కడి పరిసరాలను అందరూ కలిసి పరిశీలించారు. కానీ కర్మాగారం చూద్దామని వెళ్ళిన వారిని గేటు అవతలే ఉంచి ఎలాంటి అనుమతులు ఇవ్వకపోవడంతో వెనుదిరిగి వచ్చారు.

ఇథనాల్ కర్మాగారం అంటేనే విషం..

ఇథనాల్ కర్మాగారం అంటేనే తీవ్ర దుష్ప్రభావాలు తప్పనిసరి అవుతాయని దిలావర్‌పూర్ ఇథనాల్ వ్యతిరేక పోరాట సమితి నాయకులు రాజారెడ్డి, కోడె నవీన్, సప్పల నర్సయ్య అన్నారు. తెల్లవారు జామున చిత్తనూరు చేరుకున్న తమకు గ్రామం చేరుకోక ముందే తీవ్ర భయానక వాతావరణం



చిత్తనూరులోని ఇథనాల్ కర్మాగారం

కనిపించిందన్నారు. దట్టమైన పొగ, తీవ్ర దుర్వాసన, అడుగడుగునా మురికి నీరు కనిపించిందన్నారు. కర్మాగారం నిర్మాణం కాకముందే బంద్ చేయించాలని, నిర్మాణం జరిగితే అనేక గ్రామాలు తీవ్ర ఇబ్బందుల్లో పడుతాయని అక్కడి యువకులు పూర్తి సమాచారం అందించారన్నారు. తాము కర్మాగారాన్ని చూస్తామని కోరినా యాజమాన్యం అనుమతి ఇవ్వలేదన్నారు. ఒక్క దిలావర్‌పూర్ మండలమే కాకుండా జిల్లాలోని అనేక గ్రామాలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఇలాంటి కర్మాగారం నిలుపుదలపై ప్రతిఒక్కరూ పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

బుధవారం మండల బంద్‌కు పిలుపు..

ఇథనాల్ కర్మాగారాన్ని నిలుపుదల చేయాలంటూ ఇథనాల్ వ్యతిరేక పోరాట సమితి జేఏసీ సభ్యులు బుధవారం మండల బంద్‌కు పిలుపు నిచ్చారు. కర్మాగారం ఆపివేసేంత వరకు నిత్యం ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. పచ్చని పంటచేలు, గోదావరి సెలయేటిని కలుషితం చేస్తామంటే సహించేది లేదంటున్నారు. ఇథనాల్ వ్యతిరేక పోరాటానికి ప్రతిఒక్కరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. బుధవారం బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు.

గ్రామాల్లో పరిస్థితి దుర్భరం



గ్రామ పరిసరాల్లో కర్మాగారం అవుతుందని మొదట్లో సంతోషించాం. కానీ అతి తీవ్ర దుష్పరిణామాలు కలుగజేసే ఇథనాల్ కర్మాగారమని తెలిసి నిద్రపట్టడంలేదు. చిత్తనూరుకు వెళ్లి వాస్తవ దృశ్యాలు చూశాం. చిత్తనూరుతోపాటు పలు గ్రామాల పరిస్థితి చాలా దుర్భరంగా ఉంది. ఇలాంటి పరిస్థితి మాకొద్దు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫ్యాక్టరీ అనుమతులు ఉపసంహరించుకోవాలి.

– నంద అనిల్, మాజీ సర్పంచ్, దిలావర్‌పూర్

ప్రభుత్వాలు స్పందించాలి



కాలుష్యం అంటే పట్టణాల్లోనే ఉండేదనుకున్నాం. కానీ నేడు పల్లెల్లో కూడా కర్మాగార నిర్మాణా లతో వచ్చేలా చర్యలు జ రుగుతున్నాయి. ఇందుకు తార్కాణమే దిలావర్‌పూర్‌లో చేపడుతున్న ఇథనాల్ కర్మాగారం. మొదట్లో జీరో పొల్యూషన్ అంటూ బుకాయించారు. చిత్తనూరు వెళ్లి ఇథనాల్ కర్మాగారాన్ని పరిశీలించాం. తీవ్ర దిగ్భ్రాంతికర విషయాలు తెలుసుకున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలి.

– కోడె నవీన్, జేఏసీ సభ్యుడు

జాతీయస్థాయి క్రీడాకారులుగా ఎదగాలి

- ఉత్సాహంగా జోనల్‌స్థాయి కబడ్డీ పోటీలు
- ప్రారంభించిన ఎమ్మెల్యే పాయల్ శంకర్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శంకర్

ఆదిలాబాద్: జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయికి ఎదగాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్యభట్ట ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జోన్ లెవెల్ (ఉమ్మడి జిల్లా) అండర్–17 బాల,బాలికల కబడ్డీ ఎంపిక పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. కాసేపు కబడ్డీ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఎంతో మంది ప్రతిభగల క్రీడాకారులు ఉన్నారన్నారు. వారికి మెరుగైన శిక్షణ అందజేస్తే రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోనూ సత్తా చాటుతారన్నారు. ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కాంతారావు మాట్లాడుతూ.. జోనల్ స్థాయిలో విజేతలుగా నిలిచిన జట్లు ఈనెల 21 నుంచి 23 వరకు హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోటీల కన్వీనర్ శ్రీవర్ధన్ రెడ్డి, ఆర్గనైజర్ రాష్ట్రపాల్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టెట్ క్వాలిఫైడ్ ఉపాధ్యాయులకు పదోన్నతి ఇవ్వాలి



వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

నిర్మల్ రూరల్: టెట్ అర్హత కలిగిన ఉపాధ్యాయులతో పదోన్నతులు చేపట్టాలని విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశంకు జిల్లాకు చెందిన టెట్ క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు విన్నవించారు. ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన వెంకటేశంను హైదరాబాదులో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పదోన్నతులపై ఎలాంటి స్టే లేదని, ఎన్సీటీఈ నిబంధనలు అమలు చేయాలని కోరారు. కోర్టు ఆదేశాల మేరకు సెకండరీ గ్రేడ్, స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్లకు టెట్ అర్హత సాధించిన ఉపాధ్యాయులను మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని విన్నవించారు. వినతిపత్రం ఇచ్చినవారిలో ఉపాధ్యాయులు కాట్రాజ్ రవి, మామిడి పరుశురాములు తదితరులు ఉన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై విశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పొచ్చర గ్రామానికి చెందిన బొగ్గుల విశ్వనాథ్ (35)కు 11 ఏళ్ల కిందట భార్యతో విడాకులయ్యాయి. అప్పటి నుంచి తల్లి అనుసూయ వద్ద ఉంటు కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిన్నట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరు..

ఆదిలాబాద్‌రూరల్: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై గోవింద్ తెలిపిన వివరాల ప్రకారం అంకోలి గ్రామ పంచాయతీ పరిధిలోని సిరికొండకు చెందిన పెందురి బాధిరావ్ (29) ఉపాధి నిమిత్తం ఏడాది క్రితం హైదరాబాద్‌కు వెళ్లాడు. కీళ్ల నొప్పులతో బాధపడుతూ ఇటీవల ఇంటికి తిరిగి వచ్చాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వాహనానికి నిప్పంటించిన వ్యక్తిపై కేసు

ఎదులాపురం: కక్షసాధింపులో భాగంగా వాహనానికి నిప్పంటించిన సంఘటన ఆదిలాబాద్ పట్టణంలోని విద్యానగర్‌లో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. టుటౌన్ ఏఎస్సై ముకుంద్‌రావు తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన మనోజ్‌కుమార్, మేఘనాథ్ జిమ్ ఏర్పాటు చేద్దామని అనుకున్నారు. మేఘనాథ్ వద్ద డబ్బులు లేకపోవడంతో మనోజ్ కుమార్ ఒక్కడే జిమ్ ఏర్పాటు చేసుకున్నాడు. ఈ క్రమంలో కక్షసాధింపుగా మేఘనాథ్ మంగళవారం విద్యానగర్‌లోని మనోజ్‌కుమార్ (జిమ్‌ట్రైనర్) జిమ్ వద్దకు వెళ్లి అక్కడే ఉన్న మనోజ్ బైక్‌ని రోడ్డు మధ్యలోకి లాక్కొచ్చి తాను వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను బైక్‌పై పోసి నిప్పంటించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రైవర్, కండక్టర్ల తప్పిదం లేదు

తాంసి(బోథ్): ఆదిలాబాద్ నుంచి కరంజి(టి) వెళ్లే బస్సులో సోమవారం సాయంత్రం పరిమితికి మించి ప్రయాణికులు ఉండటం చేత బస్సును ఆపలేదని, ఇందులో ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ తప్పిదం లేదని ఆర్టీసీ డీఎం కల్పన మంగళవారం వివరణ ఇచ్చారు. మండలంలోని ఇందూర్‌పల్లి వద్ద బస్సును ఆపలేదని మహిళలు, గ్రామస్తులు బస్సును అడ్డుకున్న సంగతి తెలిసిందే. 'బస్సును అడ్డుకున్న గ్రామస్తులు' అనే శీర్షికన మంగళవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్టీసీ అధికారులు విచారణ చేపట్టారు. బస్సులో అప్పటికే 99 మంది ప్రయాణికులు ఉన్నారు. నిపాని స్టేజీ వద్ద 15మంది మహిళా ప్రయాణికులు ఎక్కారు. ఓవర్‌లోడ్ కావడంతో డ్రైవర్ బస్సును పక్కన ఆపి మహిళలను దింపేశారు. కరంజి(టి) నుంచి తిరిగి వచ్చే క్రమంలో ఇందూర్‌పల్లి వద్ద బస్సును అడ్డుకుని నిలిపివేశారు. ఈ సంఘటనలో డ్రైవర్, కండక్టర్ల తప్పు లేదన్నారు. మహాలక్ష్మీ పథకం ప్రారంభమైనప్పటి నుండి ఉచిత బస్సు సౌకర్యంలో బాలికలు, మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సురక్షిత ప్రయాణానికి చర్యలు తీసుకుంటున్నామని డీఎం తెలిపారు.

22న అథ్లెటిక్స్ పోటీలు

నిర్మల్ రూరల్: తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22న 19వ నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పద్మనాభగౌడ్, శామ్యూల్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో అండర్–14, 16 బాల బాలికలకు ఈ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనేవారు వయసు ధ్రువీకరణ పత్రాలు(గ్రామ సెక్రటరీ, తహసీల్దార్ లేదా కమిషనర్ జారీ చేసినవి), పదో తరగతి మెమోలు, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకురావాలని సూచించారు. విజేతలను అమృత్‌సర్‌లో జరిగే పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు.

సీనియర్ రీసెర్చ్ ఫెలో పోస్టుకు 22న ఇంటర్వ్యూ

ముధోల్: మండల కేంద్రంలోని వ్యవసాయ పరిశోధన స్థానంలో తాత్కాలికంగా పనిచేయుటకు సీనియర్ రీసెర్చ్ ఫెలో పోస్టుకు ఈనెల 22న ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఏరువాక ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నర్సయ్య తెలి పారు. ఎంఎస్సీ అగ్రికల్చర్ లేదా హార్టికల్చర్ చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు ఒక జత జిరాక్స్ సెట్, ఫీసేస్‌తో ఉదయం 11 గంటలకు హాజరు కావాలని సూచించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

కడెం: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని డీఆర్డీవో విజయలక్ష్మి ఆదేశించారు. మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను మంగళవారం సందర్శించారు. భోజనం తయారీ కార్మికులతో మాట్లాడారు. విద్యార్థులతో కలిసి టిఫిన్ చేశారు. ఎలగడప గ్రామంలో ఉపాధిహామీ పనులు, నర్సరీని పరిశీలించారు. ఇందులో ఈజీఎస్ ఏపీవో జయదేవ్, ఎంపీటీసీ రమేశ్, టీఏ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బోరిగాంలో జాతర

- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ
- అంతర్రాష్ట్ర మల్లయోధులకు కుస్తీ పోటీలు



జాతరకు ముస్తాబైన హనుమాన్ ఆలయం

తానూరు(ముధోల్): నిర్మల్ జిల్లా తానూరు మండలంలోని బోరిగాంలో హనుమాన్ ఆలయం 20వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించనున్న జాతరకు ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం నుంచి రెండు రోజుల పాటు ఆలయంలో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం సాయంత్రం గ్రామంలోని మహాలక్ష్మీ, పోచ్చమ్మ ఆలయాల్లో బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేస్తారు. గురువారం ఉదయం హనుమాన్ ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు మొక్కులు తీర్చుకుంటారు.

20 ఏళ్లుగా జాతర

మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన శర్మ మహారాజ్ గ్రామస్తుల సహకారంతో 2008లో బోరిగాంలో హనుమాన్ ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఏటా వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ జాతరకు మండలంతో పాటు మహారాష్ట్రలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకుంటారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అంతర్రాష్ట్ర మల్లయోధులకు కుస్తీ పోటీలు

జాతర సందర్భంగా గురువారం మధ్యాహ్నం ఒంటిగంటకు ఆలయ, గ్రామ కమిటీల ఆధ్వర్యంలో అంతర్రాష్ట్ర మల్లయోధులకు కుస్తీ పోటీలు నిర్వహించనున్నారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.7,051 నగదు, వెండి కడియం, ద్వితీయ బహుమతిగా రూ.5,051 నగదు, వెండి కడియం అందించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

జూనియర్ లైన్‌మెన్‌పై దాడికి యత్నం

- అడ్డుకున్న తోటి ఉద్యోగులు, పోలీసులకు ఫిర్యాదు



పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఏడీఈ, ఉద్యోగులు

భైంసాటౌన్(ముధోల్): విద్యుత్ బకాయిల వసూలు కోసం వెళ్లిన సిబ్బందిపై దాడికి దిగిన ఘటన మంగళవారం భైంసా పట్టణంలో జరిగింది. ఈ మేరకు విద్యుత్ ఉద్యోగులు స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏడీఈ ఆదిత్య తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి.. విధి నిర్వహణలో భాగంగా జూనియర్ లైన్‌మెన్ తోకల సుధాకర్ తోటి సిబ్బందితో కలిసి పట్టణంలోని కుంట ఏరియాలో విద్యుత్ బకాయిల వసూలుకు వెళ్లి ఓ గృహ కనెక్షన్‌కు సంబంధించి రూ.25వేల వరకు బకాయి గురించి అడిగారు. దీంతో షేక్ ముబీన్ అనే వ్యక్తి పెద్ద కర్రతో సుధాకర్‌పై దాడికి వచ్చాడు. ఈ క్రమంలో తోటి ఉద్యోగులు, స్థానికులు అతన్ని నిలువరించే ప్రయత్నం చేసి చేతిలో కర్ర లాక్కున్నారు. అయినా వినకుండా చేతులతో దాడి చేశాడు. దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పట్టణ సీఐ శ్రీనును వివరణ కోరగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దత్తజయంతి ఉత్సవాలు షురూ

- మంగళవారం నుంచి మహాపారాయణం
- 24 నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు



షిరిడీ తరహాలో ముస్తాబైన ఆలయం

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా కేంద్రం శివారులోని గండి రామన్న దత్తసాయి ఆలయం దత్త జయంతి వేడుకల కోసం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఈ నెల 24 నుంచి 26 వరకు మూడు రోజుల పాటు ఘనంగా జరిగే జయంతి వేడుకల కోసం నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు ఆదివారం అఖండ సాయి నామం, రెండో రోజు సోమవారం సాయిబాబాకు మంగళ స్నానం, అర్చన ఇతర పూజా కార్యక్రమాలు, చివరి రోజు మంగళవారం దత్త జయంతిని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న మహాపారాయణ కార్యక్రమానికి ఆలయ ట్రస్టీ చైర్మన్ లక్కడి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి షిరిడీ నుంచి ప్రత్యేకంగా సాయి పల్లకి, బాబా పాదుకలను తెప్పించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



మాట్లాడుతున్న డైరెక్టర్ సుందరేషన్

ఖానాపూర్: పసుపు రైతులు మెరుగైన యాజమాన్య పద్ధతులు, నాణ్యత ప్రమాణాలు పాటిస్తే అధిక దిగుబడి పొందవచ్చని సుగంధద్రవ్యాల బోర్డ్ డిప్యూటీ డైరెక్టర్ సుందరేషన్ అన్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం సత్తన్‌పల్లి గ్రామంలోని రైతుల వేదికలో ఆదిలాబాద్ గిరిజన రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు ఉత్పత్తిదారులకు ఇచ్చే సబ్సిడీలు, పలుపథకాల గురించి వివరించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా మార్కెట్ అవకాశాలు, విలువ ఆధారిత పద్ధతులు, అవకాశాలను తెలియజేశారు. పసుపు కొనుగోలు, అమ్మకందారుల వేదికలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రైతులు సంఘటితంగా ఏర్పడి నూతన వంగడాలను తెలుసుకోవడంతోపాటు మార్కెటింగ్ అవకాశాలు అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ అధికారి రాజమాణిక్యం, జూనియర్ అధికారి యోహాన్, ఉత్పత్తిదారుల కంపెనీ సీఈవో సుమన్, సీడాం ఆనంద్‌రావు, వైస్ చైర్మన్ బోసు నారాయణ, నాయకులు, సభ్యులు రాజమల్లు, శంకర్, సామల భీమారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఏలేటి భీమారెడ్డి, రాకేశ్, సాయిప్రియ, రామకృష్ణ, కమల, చిన్నయ్య, ఏలిబాయి, గంగప్రసాద్ పాల్గొన్నారు.

'గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి నిధులు కేటాయించాలి'



ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి విన్నవిస్తున్న నాయకులు

ఖానాపూర్: గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి నిధులు కేటాయించడంతో పాటు ఎన్ఆర్ఐ పాలసీతో కూడిన బోర్డు అమలు చేయాలని గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు దొనికేని కృష్ణ మంగళవారం వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌తో పాటు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ తదితరులను వేర్వేరుగా కలిసి విన్నవించినట్లు తెలిపారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. శాసనమండలిలో గల్ఫ్ కార్మికుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినందుకు ఎమ్మెల్సీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్



మాట్లాడుతున్న పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో మంగళవారం ఉమ్మడి జిల్లా ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇందులో డీడీటీడబ్ల్యూ దిలీప్‌కుమార్, ఏసీఎంఓ జగన్, ఉద్ధవ్, రాజమౌళి, శివాజీ, ఏటీడబ్ల్యూవోలు క్రాంతికుమార్, అమిత్, పురుషోత్తం, క్షేత్రయ్య తదితరులు పాల్గొన్నారు.

హాకీ విజేతలను అభినందించిన పీవో..

కామారెడ్డిలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ అండర్–14 బాలుర హాకీ పోటీలో విజేతగా నిలిచిన జిల్లా క్రీడాకారులను పీవో అభినందించారు. కార్యక్రమంలో డీడీ దిలీప్‌కుమార్, ఏపీవో ఆత్రం భాస్కర్, పార్థసారథి, డీవో శివప్రసాద్, ఏటీడబ్ల్యూవో క్రాంతి, పీడీ, కోచ్‌లు హేమంత్, శ్రీనివాస్, శేఖర్, శివకృష్ణ, అతుల్ పాల్గొన్నారు.

ఐఎస్ఎల్ పోటీలు పకడ్బందీగా నిర్వహించాలి

ఉట్నూర్‌రూరల్: జనవరి 18 నుంచి 20 వరకు ఉట్నూర్‌లో జరుగనున్న ఇంటర్ సొసైటీ లీగ్ పోటీలను పకడ్బందీగా నిర్వహించాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కేబీ ప్రాంగణంలోని క్రీడా మైదానాన్ని పరిశీలించారు. క్రీడాకారులు, కోచ్‌లు, అధికారులు ఉండేందుకు ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. పీవో వెంట డీడీ దిలీప్‌కుమార్, జిల్లా క్రీడా అధికారి పార్థసారథి, తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

'పది' విద్యార్థులకు ప్రతిభ పరీక్ష



ప్రతిభ పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల్లో మంగళవారం మండల స్థాయి పదో తరగతి విద్యార్థులకు రామానుజన్ జయంతి ఉత్సవాల సందర్భంగా ప్రతిభ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల్లో కేజీబీవీ, గురుకుల బాలికల, బాలుర పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. పరీక్షలను ఎంఈవో ఉదయ్‌రావు పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్ పాల్గొన్నారు.

ఎఫ్ఎల్ఎన్ పకడ్బందీగా అమలు చేయాలి

జైనథ్: పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎస్ విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎఫ్ఎల్ఎన్ నోడల్ ఆఫీసర్ మద్ది లస్మన్న అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు తమ బోధనలో సూక్ష్మ సామర్థ్యాలను ఉపయోగించి బోధించాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి, వారి సామర్థ్యాలను పరిశీలించారు.

కాంగ్రెస్‌లోకి ఎంపీపీ, జెడ్పీటీసీ



కాంగ్రెస్‌లో చేరుతున్న ఎంపీపీ అమృత్‌రావు

సిరికొండ: మండల ఎంపీపీ పెందుర్ అమృత్ రావు, జెడ్పీటీసీ కుంరం చంద్రకళలతో పాటు బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కుంరం రఘు రావులు మంగవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో మండల ఖానాపూర్ నియోజకవర్గం నుంచి బీజేపీ పార్టీ దాదాపుగా ఖాళీ అయినట్లయింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పెందుర్ అనిల్, షేక్‌బషీర్, పాండు ఉన్నారు.

కు.ని ఆపరేషన్లు



పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

బోథ్: ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆసుపత్రిలో, బోథ్ సిహెచ్ ఆస్పత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. సోమ, మంగళ వారాల్లో నిర్వహించిన శస్త్ర చికిత్సలను జిల్లా వైద్యాధికారి రాథోడ్ నరేందర్ పరిశీలించారు. ఈ నెల జిల్లాలో ఈ నెల 18వ తేదీన 12, మంగళవారం 7 చికిత్సలు చేసినట్లు జిల్లా వైద్యాధికారి రాథోడ్ నరేందర్ తెలిపారు. ఆయన వెంట వైద్యులు శ్రీనివాస్, విజయసారథి,బోథ్ రవీంద్ర ప్రసాద్‌లు ఉన్నారు.

మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

నేరడిగొండ: తేజపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మ్యాథ్స్ ఉపాధ్యాయుడు గోవర్ధన్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్ పరీక్ష నిర్వహించారు. మండలంలోని తేజపూర్, వడూర్, వాంకిడి, నేరడిగొండ జిల్లా పరిషత్ పాఠశాలల పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. కనబర్చిన విద్యార్థులను బుధవారం జరిగే జిల్లా స్థాయి మ్యాథ్స్ పరీక్షలకు ఎంపిక చేశారు. తెలుగు మీడియం నుంచి వడూర్ గ్రామానికి చెందిన నవ్య ప్రథమ, నేరడిగొండ నుంచి అవినాష్ రెండవ, నందిని మూడవ స్థానంలో ప్రతిభ కనబర్చారు. ఇంగ్లీష్ మీడియంలో ప్రథమ స్థానంలో తేజపూర్‌కు చెందిన పారస్, రెండవ స్థానంలో కేజీబీవీ నేరడిగొండ అక్షిత, మూడవ స్థానంలో క్షత్రియాలు ఎంపికయ్యారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

దుప్పట్లు పంపిణీ

ఎదులాపురం: జిల్లా కేంద్రంకు చెందిన బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.దోస దేవన్న- భూమక్కలకు పదేళ్ల తరువాత మనవడు జన్మించడంతో సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం దుప్పట్ల పంపిణీ చేపట్టారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదినాథ్ ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకొని బ్లాంకెట్ల పంపిణీ చేశామన్నారు. దాతలను ఆదర్శంగా తీసుకొని నిరుపేదలకు బ్లాంకెట్లు పంపిణీ చేయాలని కోరారు. దివ్య, వర్షా, సంగీత ఉన్నారు.

మారని బతుకులు

- ఏళ్లు గడిచినా అభివృద్ధి శూన్యం
- భీంపూర్ కొలాంగూడలో సమస్యల తిష్ట
- గ్రామంలో కానరాని కనీస సౌకర్యాలు



రోడ్డులేని భీంపూర్ కొలాంగూడ

నార్నూర్: ఏళ్లు గడిచినా కొలాం గిరిజనుల బతుకులు మారడం లేదు. అవే దుర్భరమైన జీవితాన్ని సాగిస్తున్నప్పటికీ పట్టించుకునేవారు లేరు. ఐటీడీఏ ద్వారా గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. గిరిజనుల్లో మొత్తం 33తెగలున్నాయి. అందులో కొలాం గిరిజనుల అభివృద్ధి కోసం ఐటీడీఏలో పీటీజీ పేరుతో ప్రత్యేక శాఖను ఏర్పాటు చేసి ఆ శాఖకు ప్రత్యేకాధికారిని నియమించింది. వారికి కావాల్సిన విద్యా, వైద్యం సంక్షేమం కోసం ఈ శాఖ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ కొలాం గిరిజనుల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. గ్రామాల్లో కనీస సౌకర్యాలు లేక ప్రజలు తల డిల్లుతున్నారు. ఇప్పటికీ కూలీ పని చేసి పూరి గుడిసెల్లో తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారు.

నార్నూర్‌కు కూతవేటు దూరంలోనే..

నార్నూర్ మండల కేంద్రానికి కేవలం 10కిలో మీటరు దూరంలోని భీంపూర్ కొలాంగూడలో మొత్తం 20 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఈ గ్రామంలో కనీస సౌకర్యాలు కానరావడం లేదు. గ్రామంలో సరైనా రోడ్లు లేవు. ఇల్లు లేక పూరిగుడిసెల్లో జీవనం సాగిస్తున్నారు. గ్రామంలో దాదాపు 15 నుంచి 20మంది చిన్నారులు ఉన్నారు. వారికి అంగన్‌వాడీ కేంద్రం లేక



శిథిలావస్థ ఇంటిలో కొలాం గిరిజనులు

పౌష్టికాహారం అందడం లేదు. పాఠశాల భవనం ఉన్న గత 15ఏళ్లుగా ఉపాధ్యాయులు లేక చదువుకు దూరంగా ఉండి కూలీలుగా మారుతున్నారు. జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ చొరవతో చిన్నారులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా ఒక సీఆర్‌టీ ఉపాధ్యాయుడిని అధికారులు నియమించి పాఠశాలను తెరిపించారు. పాఠశాల భవనం ఉన్న ఉపాధ్యాయ పోస్టు మంజూరు లేకపోవడంతో పక్కనే ఉన్న గొండుగూడ ప్రాథమిక పాఠశాల నుంచి మధ్యాహ్న భోజనానికి సంబంధించి సామగ్రిని తీసుకెళ్లి వండి పెడుతున్నారు.

గ్రామంలోని సమస్యల పరిష్కారానికి ఇప్పటి వరకు ఎవరు చర్యలు తీసుకోలేదు. గ్రామాన్ని అధికారులు సందర్శించిన దాఖలాలు లేవు. కొలాం గిరిజనుల పరిస్థితిని అర్థం చేసుకుని డబుల్ బెడ్ రూంలను మంజూరు చేయడంతో పాటు రోడ్డు సౌకర్యం, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

గిరి గ్రామాల అభివృద్ధిపై దృష్టి

ఏజెన్సీ ప్రాంతంలోని అన్ని గిరిజన గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తాను. ముఖ్యంగా విద్యా, వైద్యంతో పాటు రోడ్డు సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకుంటాను. ప్రతీ కొలాం గిరిజనులకు ప్రభుత్వం ద్వారా ఇళ్లు మంజూరు కోసం ప్రయత్నం చేస్తాను. ఐటీడీఏ అధికారులతో మాట్లాడి భీంపూర్ కొలాంగూడపై వివరాలను తెలుసుకుంటాను.

– కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆసిఫాబాద్

మైనార్టీల అభివృద్ధికి ప్రత్యేక కృషి



బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌ను సన్మానిస్తున్న మైనార్టీ మతపెద్దలు

ఇచ్చోడ: నియోజకవర్గంలో మైనార్టీల అభివృద్ధికి కోసం తనవంతు ప్రత్యేక కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జామ మసీద్‌లో నిర్వహించిన ఆత్మీయ సన్మాన సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. మైనార్టీల అభివృద్ధి కోసం కట్టుబడి ఉన్నానన్నారు. తన గెలుపులో మైనార్టీలో పెద్దల కృషి చాలా ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో కూడా మైనార్టీల సంక్షేమం కోసం పెద్ద పీటవేసిందన్నారు. షాదీ ముబారక్, మైనార్టీ బంధు పథకాల ద్వారా మైనార్టీల అభివృద్ధికి కృషి చేసిందన్నారు. ఈ సందర్భంగా మైనార్టీల పెద్దలు అనిల్‌జాదవ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తొమ్మిది మండలాల మైనార్టీల మత పెద్దలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అభినందనల వెల్లువ

నేరడిగొండ: బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన అనిల్ జాదవ్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఆదిలాబాద్ ఆర్డీవో స్రవంతి, నిర్మల్ జిల్లా రమేష్ రెడ్డి హాస్పిటల్ ఎండీ డాక్టర్ రమేష్ రెడ్డి, జిల్లా సహకార శాఖ ఆడిట్ అధికారి రాథోడ్ బిక్కులలు మంగళవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్కలు, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

నార్నూర్: స్వయం సహాయక సంఘం మహిళా సభ్యులు, బ్యాంకు ఖాతాదారులు నగదు రహిత లావాదేవీలపై అవగాహన తప్పని సరిగా కలిగి ఉండాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు భీంపూర్ బ్రాంచి మేనేజర్ రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని రాజులగూడ గ్రామంలోని వివేకానంద పాఠశాలలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు, నాబార్డు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులో లావాదేవీలు ఎలా జరపాలి, పలు బీమా పథకాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామంలో సీఎస్‌పీ పాయింట్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని సూచించారు. మొండి బకాయిలు ఉంటే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారి సకారంతో వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సుధామ్‌నాయక్, గ్రామ పెద్దలు ప్రేమ్‌సింగ్‌జాదవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గిరిబాబు తదితరులు ఉన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణవేణి

కైలాస్‌నగర్: మహిళలు వారికి కల్పించిన చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండడంతో పాటు అన్నిరంగాల్లో రాణించేలా ముందడుగు వేయాలని మహిళ సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్టు కృష్ణవేణి అన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీరాం కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలు, యువతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళల హెల్ప్‌లైన్ నెంబర్లు, సుకన్య సమృద్ధి యోజన, ప్రధానమంత్రి మాతృవందన యోజన, పీసీపీఎన్ డీటీ యాక్ట్‌తో పాటు మహిళలకు రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థిక, సామాజికంగా అభివృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారిక సమావేశంలో బీజేపీ నాయకులు



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే పాయల్ శంకర్ మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన అధికారిక సమీక్షా సమావేశంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. అధికారులు, కౌన్సిలర్లతో నిర్వహించిన ఈ సమావేశంలో మహిళా కౌన్సిలర్ల స్థానంలో వారి భర్తలు జోగు రవి, సోమ రవి పాల్గొనగా బీజేపీ నాయకులు మహేందర్, వేదవ్యాస్, మయూర్ చంద్ర, గొర్ల రాము, లింగారెడ్డి హాజరు కావడంపై అధికారులు విస్మయం వ్యక్తం చేశారు. అధికారికంగా నిర్వహించిన సమీక్ష సమావేశంలో బీజేపీ నాయకుల పెత్తనం ఏమిటనే అభిప్రాయం బల్దియా వర్గాల్లో వ్యక్తమైంది.

పత్తి అమ్ముకోవడంలో సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న జిల్లా నాయకులు దత్తాత్రి

ఎదులాపురం: ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐకి పత్తి అమ్ముకోవడంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు బండి దత్తాత్రి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో పత్తిని సీసీఐకి అమ్ముకోవడంలో చాలా సమస్యలు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు.. రైతులు ఇచ్చిన బ్యాంక్ అకౌంట్‌లోనే పత్తి అమ్మిన డబ్బులు వేయాలని, మహిళ పట్టాదారునే కాకుండా కుటుంబ సభ్యులు ఎవరు వచ్చినా పత్తిని అమ్ముకునే అవకాశం ఇవ్వాలన్నారు. అనంతరం సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మార్కెటింగ్ ఏడీకి వినతిపత్రం అందించినట్లు పేర్కొన్నారు. ఇందులో సంతోశ్, సుదర్శన్, స్వామి, సందేశ్ పాల్గొన్నారు.

ప్రజా సేవ కోసం పనిచేస్తా

- కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కంది శ్రీనివాస్‌రెడ్డి

బేల: ప్రతినిత్యం అందుబాటులో ఉండి ప్రజాసేవ చేస్తానని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని సాంగిడి, కొత్త సాంగిడి, కాంఘర్ పూర్, మణియార్‌పూర్, దహెగాం, కోగ్దూర్ తదితర గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం పర్యటించారు. పలువురు కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో నమ్మకంతో ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఓడిపోయినప్పటికీ ఎక్కడికి పారిపోనని, భవిష్యత్‌లోనూ ఇక్కడే ఉంటానని పేర్కొన్నారు. ఆదిలాబాద్ అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీ ఓడినప్పటికీ, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు దక్కేలా చూడాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ ముడుపు దమోదర్‌రెడ్డి, జిల్లా నాయకులు బాలురి గోవర్దన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, నాయకులు వాంఖడే వామన్, గుండవార్ సంజయ్, బొక్రే శంకర్, మడావి చంద్రకాంత్ పాల్గొన్నారు.

శనగలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి



శనగ పంటను పరిశీలిస్తున్న ఏఈవో తౌసీఫ్

జైనథ్: శనగ పంటలో అవసరమైన సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఏఈవో తౌసీఫ్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని పెండల్‌వాడ గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి శనగ పంటలను పరిశీలించి మాట్లాడారు. అక్కడికక్కడ శనగలో ఎండు తెగులు కనిపిస్తున్నందున రైతులు 200లీటర్ల నీటిలో 600గ్రాముల బ్లూ కాపర్, 20గ్రాముల ప్లాంటమైసిన్‌ను కలిపి ఎకరం విస్తీర్ణంలో పిచికారీ చేసుకోవాలని సూచించారు. శనగలో పచ్చపురుగు నివారణకు 200లీటర్ల నీటిలో 2.5 ఎంఎల్ క్లోరోపైరిపాస్‌ను కలిపి పిచికారీ చేసుకుంటే ఫలితం ఉంటుందన్నారు.

మహాలక్ష్మీ పథకాన్ని రద్దు చేయాలి



ఇంద్రవెల్లి: అమరవీరుల స్తూపం వద్ద ఆటో డ్రైవర్లు

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన మహాలక్ష్మీ పథకంతో తమ బతుకులు దారుణంగా మారాయని, వెంటనే మహాలక్ష్మీ పథకాన్ని రద్దు చేయాలని ఆటో యూనియన్ గౌరవాధ్యక్షుడు గాయక్‌వాడ్ భారత్ అన్నారు. మంగళవారం మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అక్కడ నుంచి మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రోజు ఆటో నడుపుతూ కుటుంబ పోషణ చేస్తున్న తమపై కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన మహాలక్ష్మీ పథకం కారణంగా ఉపాధి కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. రోజు ఆటో నడిపిన సరిపడా డబ్బులు రావడం లేదని, బస్సుల్లో ఉచిత ప్రయాణంతో మహిళలు ఆటోలో ఎక్కడం లేదన్నారు. వెంటనే ప్రభుత్వం ఆ పథకాన్ని రద్దు చేయాలని, లేకుంటే ఆటోబంధును కల్పించాలని, నెల ఫైనాన్స్ కిస్తీలను ప్రభుత్వమే భరించలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ మండల అధ్యక్షుడు తిట్టె సాగర్, ఉపాధ్యక్షుడు జాదవ్ లక్ష్మణ్, ఆటో డ్రైవర్లు రాందాస్, నాగేష్, గిల్బే భారత్, జాకేశ్వర్ తదితరులున్నారు.

ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఇచ్చోడ: కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులును ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో సిరికొండ ఆటో అడ్డా వద్ద ఏఐటీయూసీ అనుబంధ ఆటో డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన మహాలక్ష్మీ పథకంతో ఆటో కార్మికులకు ఉపాధి కరువైందన్నారు. ఇకనైనా ప్రభుత్వం కరుణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి చిల్క దేవిదాస్, ఇచ్చోడ మండల కార్యదర్శి కళ్లెపెల్లి గంగయ్య, ఆటో కార్మికులు కోట్నాక్ జంగు, రవి, అరుణ్, సలీం సంబాజీ భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల అందోళన

నార్నూర్: మండల కేంద్రంలోని ఆటో యూనియన్ కార్యాలయం నుంచి గాంధీచౌక్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ జాడి రాజలింగంకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆటో యూనియన్ అధ్యక్షుడు ఫెరోజ్‌ఖాన్ మాట్లాడారు. మహాలక్ష్మీ పథకంతో ఆటో డ్రైవర్ల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. ఫైనాన్స్ కట్టలేని పరిస్థితి ఉందన్నారు. ఇందులో నాయకులు ఎస్‌కే చోటు ఎస్‌కే బాసిద్, సద్దాం, సకలాల్, ప్రతాప్, కిరణ్ రాథోడ్ ఉన్నారు.



ఇంద్రవెల్లి: ఆటోలతో ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు



ఇచ్చోడ: ధర్నాలో మాట్లాడుతున్న దేవేందర్

దళితులపై దాడులు అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లన్న

ఎదులాపురం: దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని మాల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు మేకల మల్లన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. మావల సమీపంలో ఎంబడి వంశీ అని దళిత వ్యక్తిపై కౌన్సిలర్ ఉష్కం రఘుపతి అనుచరులు హత్యాయత్నానికి ప్రయత్నించారని ఆరోపించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఇందులో మాల సంక్షేమ సంఘం నాయకులు అశోక్, శాంతి రవి, మేదరి స్వామి, బొబ్బిలి స్వామి, రాములు, సురేశ్, నర్సింలు, ఆనంద్ పాల్గొన్నారు.

యువకుడిపై కేసు

ఎదులాపురం: యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిపై మంగళవారం టుటౌన్ ఎస్సై నవీన్ కేసు నమోదు చేశారు. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన యువకుడిపై యువతి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపాడు.

మాల సంక్షేమ సంఘం ఎన్నికలు



మాట్లాడుతున్న కన్వీనర్ సింగరి అశోక్

ఎదులాపురం: జనవరిలో మాల సంక్షేమ సంఘం జిల్లా నూతన కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందని సంఘం కన్వీనర్ సింగరి అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంగళవారం మాట్లాడారు. మాల సంక్షేమ సంఘం జిల్లా కమిటీ గడువు ఆగస్టు 2023 తో ముగిసిందని వెల్లడించారు. నూతన కమిటీ ఎన్నికకు సంబంధించి అడ్‌హాక్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. డిసెంబర్ 20వ తేదీ నుంచి జనవరి 10వ తేదీ వరకూ గ్రామస్థాయి, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. జాబితాల పరిశీలన అనంతరం ఎన్నికలు నిర్వహించనున్నట్లు వివరించారు. గ్రామ, మండల స్థాయి కమిటీల ఎన్నికలు పూర్తయిన తర్వాత జిల్లా స్థాయి కమిటీని జనవరి 10వ తేదీ తర్వాత ఎన్నికలు ఉంటాయన్నారు. ఈ విషయాన్ని సంఘం నాయకులు గమనించాలన్నారు. ఇందులో సంఘం నాయకులు పాల్గొన్నారు. ఇందులో మాల సంక్షేమ సంఘం నాయకులు మల్లన్న, శాంతి రవి, మేదరి స్వామి, బొబ్బిలి స్వామి, రాములు, సురేశ్, నర్సింలు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సప్తాహం

గుడిహత్నూర్: మండలంలోని ఉమ్రి పరిధిలోని రామ మందిరంలో నేటి నుంచి అఖండ హరినామ సప్తాహం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. వారం రోజులపాటు భగవద్గీత పఠనంతో పాటు రాత్రి భజన కీర్తన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.